క్లుప్తంగా

వినియోగదారుల హక్కులపై శిక్షణ



మాట్లాడుతున్న రాజారెడ్డి

తిరుపతి కల్చరల్ : వినియోగదారుల హక్కుల రక్షణ బాధ్యతగా భావించాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి.రాజారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని యూత్ హాస్టల్‌లో వినియోగదారుల హక్కులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆకర్షణీయమైన అసత్య ప్రకటనలతో పలు సంస్థలు యథేచ్ఛగా వినియోగదారులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ మేరకు ఎవరూ నష్టపోకూడదనే సదుద్దేశంతో వినియోగదారుల చట్టం అమలులోకి వచ్చిందని వెల్లడించారు. ఇలాంటి మోసాలపై కన్జ్యూమర్ ఫోరమ్‌లో ఫిర్యాదు చేస్తే ఎలాంటి ఫీజు చెల్లించకుండానే రూ.5లక్షల వరకు పరిహారం పొందే అవకాశముందని వివరించారు. ఈ మేరకు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.నాగేశ్వరరావు, శివమూర్తి, ఇమ్మాన్యుయేల్, సతీష్‌కుమార్, శ్రీనివాసులు, వీఎస్ రెడ్డి, శేషాద్రి , రామారావు, గాయత్రి, చంద్రశేఖర్, దాసమునిరెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి అమానుషం



మాట్లాడుతున్న రాజేష్‌కుమార్

తిరుపతి కల్చరల్ : చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగనాథన్‌పై మతోన్మాదుల దాడి అమానుషమని సంస్కార ఫౌండేషన్ చైర్మన్ రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రామరాజ్యం డాట్ నెట్ వెబ్‌సైట్ నిర్వాహకుడు వీరరాఘవరెడ్డి తన అనుచరులతో కలిసి రంగనాథన్‌ను దుర్భాషలాడి దాడికి పాల్పడడం దారుణమని మండిపడ్డారు. ఈ ఘటనను బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఖండించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విజయకుమార్, అనిల్‌కుమార్, సాయికృష్ణ శర్మ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ త్రిపుర సుందరి

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో సోమవారం ట్రాన్స్‌జెండర్లకు చట్టాలు, హక్కులు, పరిరక్షణ, భవిష్యత్ ప్రణాళికలపై అవగాహన కల్పించారు. జర్నలిజం విభాగం ప్రొఫెసర్ త్రిపుర సుందరి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లను సామాజికంగా చిన్నచూపు చూడడం సరికాదన్నారు. వివక్షను తొలగించేందుకు విద్యావేత్తలు, సామాజికవేత్తలు, పోలీసులు, ఎన్జీఓలు, డాక్టర్లు కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ నుంచే టీచర్లు అవగాహన పెంపొందించాలని, ట్రాన్స్‌జెండర్లు ఉన్నతంగా చదువుకునే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్వోదయ మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రిటైర్డ్ ప్రొఫెసర్ ఆదినారాయణ, ప్రొఫెసర్ ఉమాదేవి, డాక్టర్ జనార్దన్ రాజు, సుమిత్ర, ట్రాన్స్‌జెండర్ సంఘాల నేతలు పాల్గొన్నారు.

జేసీ బాబుకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న బాబు

తిరుపతి కల్చరల్ : విద్యారంగంలో విశేష సేవలందించిన జేసీ బాబుకు జాతీయస్థాయి బంగారు నంది పురస్కారం లభించింది. సోమవారం హైదరాబాద్‌లోని త్యాగరాజ గాన సభలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలుగు కళారత్నాలు సాంస్కృతిక శాఖ సీఈఓ డాక్టర్ రత్నం, జాతీయ కన్వీనర్ డాక్టర్ ధనాసి ఉషారాణి, హైకోర్టు న్యాయవాది డాక్టర్ జగదీష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

టౌన్‌బ్యాంక్ అభివృద్ధే లక్ష్యం



జయచంద్రారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్

తిరుపతి మంగళం : తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంక్ (టౌన్ బ్యాంక్) అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2013లో కంప్యూటరైజ్డ్ మైగ్రేషన్ తప్పిదంతో వడ్డీకి వడ్డీ పడడంతో రుణగ్రహీతలపై అధిక భారం పడిందన్నారు. దీనిపై బ్యాంకు అధికారులు, ఆడిటర్లు సమగ్రమైన నివేదిక తెప్పించుకుని చక్ర వడ్డీని తగ్గించారని వెల్లడించారు. రాజకీయ ప్రయోజనాలతో వడ్డీ తగ్గించామని ఓ పత్రికలో వార్తలు రావడం అన్యాయమని మండిపడ్డారు. చక్రవడ్డీలు తగ్గించడంలో బ్యాంకు పాలకవర్గం ప్రమేయం ఉండదని స్పష్టం చేశారు. పత్రికలు సైతం బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని, తప్పుడు వార్తలతో బ్యాంక్ ప్రతిష్టను దెబ్బతీయడం సరికాదని విజ్ఞప్తి చేశారు.

గోవిందుని తేజం

శ్రీగోవిందరాజస్వామి వారి తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు తెప్పపై విలాసంగా విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవదేవేరులకు వేడుకగా స్నపన తిరుమంజనం జరిపించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. అనంతరం తెప్పపై అమ్మవార్లతో కలిసి గోవిందరాజ స్వామివారు కొలువుదీరారు. పుష్కరిణిలో ఏడు ప్రదక్షిణలు చేస్తూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ జేఈఓ వి.వీరబ్రహ్మం, సీవీఓ బాలాజీ, ఆలయ డిప్యూటీ ఈఓలు వీఆర్ శాంతి, సి.గోవిందరాజన్ పాల్గొన్నారు.





– తిరుపతి కల్చరల్

సీతారాముల అభయం



శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి అనుబంధంగా వెలసిన రాముల వారు సోమవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. సాయంత్రం సర్వాలంకార శోభితుడైన స్వామివారు సీతాలక్ష్మణ సమేతంగా బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూరింటెండెంట్ రాజ్ కుమార్ పాల్గొన్నారు. – చంద్రగిరి

ఆక్రమణల బాట

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలం కబ్జా

- బండి దారిని ఆక్రమించి మద్యం దుకాణానికి అప్పగింత
- హెచ్చరిక బోర్డును సైతం లెక్కచేయని కబ్జాదారుడు



కబ్జా స్థలంలో నిర్మించిన గదిలోనే ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 150 అడుగుల జాతీయ రహదారిలో ఓ కబ్జాదారుడు బరితెగించాడు. అరకోటి విలువైన ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేశాడు. ఆపై ఆ భూమిని ప్రయివేటు మద్యం దుకాణానికి అద్దెకు ఇచ్చి లక్షల రూపాయలు దండుకుంటున్నాడు. ఇటీవల సదరు స్థలంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టినా కబ్జాదారుడు లెక్కచేయకపోవడం గమనార్హం.

రోజూ అవస్థలే!

తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట గ్రామ లెక్క దాఖల సర్వే నం.18/2లోని ప్రభుత్వ భూమి (బండి బాట)ని తుమ్మలగుంటకు చెందిన ఓ వ్యక్తి కబ్జా చేశాడు. తుమ్మలగుంట నుంచి ఉప్పరపల్లికి వెళ్లే క్రాస్ రోడ్డు (వీఐపీ మొయిన్ రోడ్డు)కు ఉన్న వంద అంకణాలకు పైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించాడు. ఆపై ఓ వైన్ షాపు వారికి అద్దెకు ఇచ్చి లక్షల్లో అద్దె వసూలు చేస్తున్నాడు. ఆ మద్యం దుకాణం చుట్టు పక్కల పలు ప్రయివేటు, ప్రభుత్వ కళాశాలలు, హాస్టళ్లు, వర్సిటీలు ఉన్నాయి. అదే క్రాస్ రోడ్డు నుంచి నిత్యం వేల మంది విద్యార్థులు వచ్చి వెళ్తుంటారు. మద్యం షాపు వద్ద మందుబాబుల వెకిలి చేష్టలతో అటువైపు రావాలంటేనే జంకుతున్నారు.

వదిలేశారు

గతంలో సిద్ధార్థ జైన్, ప్రద్యుమ్న కలెక్టర్లుగా పనిచేసినప్పుడు అక్కడ బ్రాందీ షాపు పెట్టనివ్వలేదు. వీఐపీలు వచ్చి వెళ్లే మార్గం కనుక అక్కడి బ్రాందీ షాపు లైసెన్సులు కూడా రద్దు చేశారు. సదరు భూ కబ్జాదారుడిపై అప్పట్లో క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరికలు జారీచేశారు. ఆ తర్వాత ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ స్థలంలోనే బ్రాందీ షాపు ఏర్పాటు చేసి రూ.లక్షలు బాడుగ కింద దండుకుంటున్నాడు. ఇటీవల స్పందించిన రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టి వదిలేశారు. కానీ ఇవేవీ పట్టించుకోని కబ్జాదారుడు తన పని కానిచ్చేస్తున్నాడు. ఇకనైనా అధికారులు స్పందించాల్సి ఉంది.



ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కార్మికులను వేధిస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్

తిరుపతి తుడా: కార్మికులను తీవ్రమైన వేధింపులకు గురి చేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్ టీ.ప్రభావతిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఆపై డైరెక్టర్ ఆర్వీ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మురళి మాట్లాడుతూ స్విమ్స్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలని, గత 32 ఏళ్లుగా పనిచేస్తున్న వారికి వేతనాలు పెరగలేదన్నారు. కార్మికులపై వేధింపులకు గురిచేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్‌పై ఉన్నతాధికారు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు టీ.సుబ్రమణ్యం ఆర్.లక్ష్మి, పీ.బుజ్జి, పీ.చిన్న, బీ.శ్రీరాములు, స్విమ్స్ కార్మికులు పాల్గొన్నారు.



డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

ఇంటి స్థలాల కోసం ధర్నా

తిరుపతి రూరల్ : ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పేదలకు వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రామానాయుడు మాట్లాడుతూ నగర సమీపంలోని ప్రభుత్వ భూములలో ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున మంజూరు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథ్, ఎన్‌డీ రవి, పద్మనాభ రెడ్డి, ఎన్.శివ, శ్రీరాములు, రత్నమ్మ, కేవై రాజా, రామకృష్ణ, గోవిందు స్వామి విజయమ్మ, మునీశ్వర్, లక్ష్మి, ఆర్‌వీ రమేష్, అల్లా బాషా, ప్రమీల, రామమూర్తి, పూర్ణ, విక్రమ్, అలివేలమ్మ, రామచంద్ర, విజయ, అలివేలు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

హెడ్ కానిస్టేబుల్‌కు ఆర్థిక సాయం

తిరుపతి క్రైమ్ : అనారోగ్యంతో సీఎంసీలో చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్‌కు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చేతులమీదుగా ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఈమేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రకాష్ కుమారుడు అజయ్ కుమార్‌కు ఐఆర్ ఫండ్ కింద రూ.లక్ష చెక్కును అందించారు. కార్యక్రమంలో ఏఓ సురేష్ బాబు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఆర్‌ఎఫ్‌పీ టెండర్లలో అన్యాయం

తిరుపతి కల్చరల్: ఆర్‌ఎఫ్‌పీ కొత్త టెండర్లలో 104 ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని 104 ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు తలారి రామకృష్ణ, జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో 104 ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్‌ఎఫ్‌పీలో జీతభత్యాల విషయంలో మార్పులేదని, శ్లాబ్‌లో స్పష్టత లేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీటీసీ విధానాన్ని రద్దు చేసి ఈపీఎఫ్‌లో యాజమాన్యం వాటా చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఉద్యోగుల సరీ్వసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. నేతలు తిరుమల బత్తిరెడ్డి, కిరణ్‌కుమార్, జయచంద్ర పాల్గొన్నారు.

‘ఆప్కాస్’రద్దు విరమణకు వినతి

తిరుపతి సిటీ : ఆప్కాస్ రద్దు చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర కోరారు. సోమవారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఏడీ బిల్డింగ్ ఎదుట ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రిజి్రస్టార్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పట్ల దారుణంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఆప్కాస్ రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్షా 20 వేల మందికి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

లారీ ఢీకొని యువకుడికి గాయాలు

తిరుపతి రూరల్ : మండలంలోని వేదాంతపురం కూడలిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. సి.మల్లవరం పంచాయతీ గాంధీనగర్‌కు చెందిన వేలుస్వామి కుమారుడు వినోద్ కుమార్ (23) బైక్‌పై తిరుపతి వైపు వస్తుండగా లారీ ఢీకొంది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్ఆర్ఎస్ సమస్యపై ఫిర్యాదు



వినతిపత్రం అందిస్తున్న హంస నేతలు

తిరుపతి తుడా : ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రీడింగ్ సిస్టమ్)లో తరచూ సాంకేతిక సమస్యల తలెత్తుతున్నాయని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా ఆరోపించారు. సోమవారం ఈ మేరకు రుయా సూపరింటెండ్ రవిప్రభుకు ఫిర్యాదు చేశారు. రాజా మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్‌లో సమస్యల కారణంగా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. విధులకు హాజరైనా గైర్హాజరుగా నమోదవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ స్పందిస్తూ వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అబాకస్‌లో మాతృశ్రీ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న సుధాకర్‌నాయుడు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి రైల్వే కాలనీలోని మాతృశ్రీ పాఠశాల రెండో తరగతి విద్యార్థి ఎ.జయదీప్ రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలో ప్రతిభను చాటాడు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన విశ్వం ఎడ్యుటెక్, అబాకస్ స్టార్ రాష్ట్ర స్థాయి పోటీలో తృతీయ బహుమతి సాధించాడు. సోమవారం ఈ మేరకు విద్యార్థికి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.సుధాకర్‌నాయుడు అభినందనలు తెలిపారు.


మట్టి కొట్టేస్తున్నారు!

- నకిలీ పత్రాలతో అధికారులకు బురిడీ
- యథేచ్ఛగా అక్రమ రవాణా

చంద్రగిరి: అక్రమార్జనకు కాదేది అనర్హం అన్నట్లు గ్రావెల్ స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. పట్టా భూమిని చదును చేసుకుంటున్నామంటూ అధికారులను నకిలీ పత్రాలతో బురిడీ కొట్టిస్తున్నారు. భారీ యంత్రాలతో పట్టపగలే మట్టిని తవ్వేసి అక్రమంగా తరలించేసి సొమ్ము చేసుకుంటున్నారు. లోగుట్టు తెలిసినా మైనింగ్.. రెవెన్యూశాఖ సిబ్బంది చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. టీడీపీ నేతలు కొందరు ఇదే పనిలో నిమగ్నమై రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు.

టిప్పరు రూ.3 వేలు, ట్రాక్టర్ రూ.500

తన పొలం చదును చేసుకుంటున్నట్లు కలరింగ్ ఇచ్చి మట్టి మాఫియాను కొంత మంది టీడీపీ నేతలు ప్రోత్సహిస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం రైతు తన పొలంలో మట్టిని కేవలం చదునుకు మాత్రమే అక్కడే ఉపయోగించాలి. అలా కాకుండా టిప్పరు ధర రూ.3వేలు, ట్రాక్టర్ ధర రూ.500ల చొప్పున విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో సుమారు 100 లోడ్ల టిప్పర్లతో తరలించేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై మండిపడుతున్నారు. కేజీఎఫ్ తరహాల్లో పెద్ద పెద్ద గోతులు తవ్వేశారని, భారీ వాహనాలు పట్టపగలే రయ్ మంటూ వెళుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గంగుడుపల్లె సమీపంలో అక్రమంగా మట్టిని తవ్వేసి తరలిస్తున్న దృశ్యం

ఇటుక బట్టీలు, వెంచర్లకు తరలిస్తూ..

గంగుడుపల్లె నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలించేస్తున్నారు. టిప్పర్ల ద్వారా తరలిస్తున్న మట్టిని ఇటుక బట్టీలు, వెంచర్లు, లే అవుట్ విస్తరణలో రోడ్లు వేయడానికి వినియోగిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. అయితే మట్టిని తరలించేందుకు గత తహసీల్దార్ అనుమతులు ఇచ్చారని, ఈ మేరకు తాము తన పొలాన్ని చదును చేసుకుంటున్నట్లు రెవెన్యూ, మైనింగ్ అధికారులను బురిడి కొట్టించడంపై స్థానికులు నవ్వుకుంటున్నారు. అధికారులకు వాల్టా చట్టంపై కనీసం అవగాహన లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫియాలపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.

పనులను అడ్డుకున్నాం

గంగుడుపల్లె సమీపంలోని ఓ రైతు తన పొలంలోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే సిబ్బంది ద్వారా తరలింపు పనులను అడ్డుకున్నాం. అయితే గతంలో మట్టి తరలించేందుకు తమకు అనుమతులు ఇచ్చారంటూ రైతు తెలిపాడు. అనుమతులకు సంబంధించిన పత్రాలను తీసుకురమ్మని ఆదేశించాం. వాటిని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– శివరామ సుబ్బయ్య, తహసీల్దార్, చంద్రగిరి

కపిలతీర్థం నీటి రక్షణకు వినతి

తిరుపతి తుడా : కపిలతీర్థం నుంచి ప్రవహించే వర్షపు నీటిని రక్షిస్తే నగరంలో తాగునీటి సమస్యను అరికట్టవచ్చని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కపిలతీర్థం నీటి పరిరక్షణ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం ఈ మేరకు అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సభ్యుడు కేజే హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

అంకితభావం.. అవసరం



విద్యార్థులకు పట్టాలు అందిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : సమాజంలో న్యాయ వృత్తి ఉత్తమమని, వారికి అంకితభావం అవసరమని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ వైఆర్ హరగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మహతి కళాక్షేత్రంలో అనంత లా కళాశాల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హరగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయ శాస్త్రం అభ్యసించిన విద్యార్థులందరూ సోషల్ ఇంజినీర్స్ అని వెల్లడించారు. న్యాయవాదులు సామాజిక దృక్పథంతో పేదలకు సేవలందించాలని కోరారు. కళాశాల చైర్మన్ అనంత రవి మాట్లాడుతూ న్యాయ రంగంలో నిజమైన మార్పును తీసుకురావాలంటే నిబద్ధత, నిజాయితీ అవసరమని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనంత ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండర్ అధ్యక్షుడు జయరామయ్య పాల్గొన్నారు.

15 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు.

పుస్తకంపై దాడి హేయం

తిరుపతి సిటీ : పుస్తక ప్రదర్శనపై శనివారం రాత్రి జరిగిన దాడి హేయమని తిరుపతి పుస్తక ప్రియుల ఐక్యవేదిక కన్వీనర్ వాకా ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సెట్ కన్వీనర్‌కు నియామక పత్రం



నియామకపత్రం అందుకుంటున్న వెంకటేశ్వర్లు

తిరుపతి సిటీ : ఏపీ పీజీ సెట్ 2025 , ఏపీ రీసెట్ 2025 ప్రవేశ పరీక్షలకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లును ఉన్నత విద్యామండలి నియమించింది. సోమవారం ఈ మేరకు ఎస్వీయూ వీసీ అప్పారావు రిజి్రస్టార్ భూపతి నాయుడు నియామక పత్రం అందించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్య పానం నిషేధం



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

పాకాల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తప్పవని చంద్రగిరి డీఎస్పీ బీ.ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మండలంలోని దామలచెరువు పంచాయతీ పరిధిలోని మ్యాంగోనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ సుదర్శన్‌ప్రసాద్, ఈఓ కే.మహేశ్వరి పాల్గొన్నారు.